క్లుప్తంగా

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



పూజల్లో ఎమ్మెల్యే శంకర్, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సింలు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత ఆరు రోజులుగా నిర్వహించిన మహాకుంబ ప్రోక్షణ, పవిత్రోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. స్వామివారి విగ్రహాన్ని పునప్రతిష్ఠించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం సుదర్శన నారసింహ హోమం, ద్వార బలి, మహాపూర్ణాహుతి వంటి తదితర పూజా కార్యక్రమాలతో పాటు స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్



సభ్యత్వ నమోదులో పాల్గొన్న విద్యార్థులు

చేవెళ్ల: విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాటం చేస్తోందని చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కళాశాలల్లో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్‌ఎఫ్‌ఐ ఏర్పాటు నుంచి ఇప్పటివరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐలో చేరిన విద్యార్థులు ఉద్యమంలో భాగమై, సమాజంలో మార్పులు తీసుకొచ్చేందుకు కృషి చేసే నాయకులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో సభ్యులు చరణ్‌గౌడ్, రేశ్వంత్, చందు, రాము, శ్రీశైలం, ఇర్ఫాన్ ఉన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్ర సామగ్రి

మొయినాబాద్: రైతులకు సబ్సిడీపై అందజేసే వ్యవసాయ యంత్ర సామగ్రి అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్ప్రేయర్లు 160, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు 24, రోటవేటర్లు 8, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్స్ 2, కల్టివేటర్లు అండ్ డిస్కహారో 12, బండ్ ఫార్మర్ 1, పవర్ వీడర్ 1, బుష్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 1, మొక్కజొన్న షెల్లర్ 1, స్ట్రాబేలర్ 1 అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, జనరల్ రైతులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. ట్రాక్టర్‌తో నడిచే యంత్ర సామగ్రి పొందేందుకు రైతు లేదా రైతు భార్య పేరు మీద ట్రాక్టర్ నమోదై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ), మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న జోగన్నగూడెం రమేశ్ అకస్మాత్తుగా బుధవారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, కార్యదర్శి సందీప్ ప్రభుత్వం తరఫున రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఇబ్రహీం, కుమ్మరి నవీన్‌కుమార్, కుమ్మరి సురేష్, పుట్టోనిగూడెం అర్జునయ్య, కందూరి చంద్రమౌళి పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంపై అవగాహన

షాబాద్: నాటుకోళ్ల పెంపకం గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటుగా ఉంటుందని తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దెంగూడలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నాటుకోళ్ల పెంపకంపై మండల పశువైద్యాధికారి స్రవంతి, వెల్‌స్పన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు నాటుకోళ్ల పెంపకం విధానం, వాటి సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నివారణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, సిబ్బంది శ్వేత, శ్రావణి, సుగుణమాల ఎఫ్‌పీఓ చైర్మన్ లింగం తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ స్థానాలు ఖరారు

- మున్సిపాలిటీ ఏర్పాటుతో తగ్గిన సంఖ్య
- గతంలో 17 స్థానాలు ఉండగా.. ప్రస్తుతం తొమ్మిదికే కుదింపు
- తుది జాబితాను విడుదల చేసిన అధికారులు



మొయినాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం

మొయినాబాద్‌రూరల్: మండలంలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య తొమ్మిదికే కుదింపైంది. గతంలో 17 స్థానాలు ఉండగా.. ప్రస్తుతం తొమ్మిదికే ఖరారైంది. ఇటీవల అధికారులు ఈ ఎంపీటీసీ స్థానాలపై కసరత్తు చేసి గత నెలలో తుది జాబితాను విడుదల చేశారు. మండలంలో ఇక తొమ్మిది స్థానాలకే ఎన్నికలు జరగనున్నాయి.

తగ్గిన స్థానాలు..

మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా.. గతంలో 17 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కాగా కొత్తగా మొయినాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో 9 గ్రామపంచాయతీలు అందులో విలీనమయ్యాయి. దీంతో మిగిలిన 19 గ్రామాలతో కలిపి తొమ్మిది ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు. మండలంలో 2011 లెక్కల ప్రకారం మొత్తం జనాభా 17 ఎంపీటీసీ స్థానాలకుగాను 50,378 ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు గాను 19 గ్రామ పంచాయతీల్లో 31,056 ఓటర్ల జాబితాను ఏర్పాటు చేశారు. గ్రామాలను అటూ ఇటూ సర్దుబాటు చేసి తొమ్మిదికి కుదించారు.

ఎంపీటీసీ స్థానాలు ఇవే..

మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో తొమ్మిది గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీ పరిధిలోకి వెళ్లగా మిగతా 19 గ్రామ పంచాయతీలతో కలిపి తొమ్మిది ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు. అందులో అమ్డాపూర్ ఎంపీటీసీలో అమ్డాపూర్, కాశింబౌలి 3,030 ఓటర్లు, రెండో ఎంపీటీసీ స్థానం కనకమామిడి ఇందులో కనకమామిడి, అప్పారెడ్డిగూడ ఓటర్ల సంఖ్య 3,997, రెడ్డిపల్లి ఇందులో రెడ్డిపల్లి, చందానగర్, మోత్కుపల్లి ఓటర్ల సంఖ్య 3,549, నాలుగో ఎంపీటీసీ స్థానం బాకారం జాగీరు ఇందులో బాకారం జాగీరు, నాగిరెడ్డిగూడ ఓటర్ల సంఖ్య 3,916, చిన్నమంగళారం ఓటర్ల సంఖ్య 3,033, కేతిరెడ్డిపల్లి ఇందులో ఓటర్ల సంఖ్య 2589, ఏడవది మేడిపల్లి ఇందులో మేడిపల్లి, కుత్బుద్దీన్‌గూడ, ఎల్కగూడ, ఓటర్ల సంఖ్య 4,175, ఎనిమిదో స్థానం తోల్‌కట్ట ఇందులో తోల్‌కట్ట, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి ఓటర్ల సంఖ్య 3,521, తొమ్మిదో స్థానం శ్రీరామ్‌నగర్ ఇందులో శ్రీరామ్‌నగర్, వెంకటాపూర్ ఓటర్ల సంఖ్య 3,246 ఈ విధంగా తొమ్మిది ఎంపీటీసీలకు గాను 31,056 ఓటర్ల సంఖ్యలో ఏర్పాటు చేశారు. ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని అధికారులు పేర్కొంటున్నారు.

జనాభా ఆధారంగా..



మండలంలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి. గతంలో 17 స్థానాలు ఉండగా.. ప్రస్తుతం తొమ్మిది స్థానాలు ఏర్పాటయ్యాయి. నిబంధనల ప్రకారం.. మండలంలోని జనాభా ఆధారంగా ఆయా ఎంపీటీసీ పరిధిలోకి వచ్చే గ్రామాల భౌగోళిక స్వరూపాన్ని పరిశీలించి ఏర్పాటు చేశాం. తుది జాబితాను కూడా గత నెలలో ప్రకటించాం. ఇక మండలంలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలతోనే ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలకు అన్ని సిద్ధం చేశాం.

– సంధ్య, మండల అభివృద్ధి అధికారి

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



నూతన బూత్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని చందనవెల్లిలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ 232 ఎం.మల్లేష్, 233 కె.కృష్ణను నియమించారు. అనంతరం వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు సలహాలు ఇచ్చామన్నారు. ప్రతి కార్యకర్త శ్రమిస్తే విజయాన్ని అందుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హరీశ్, శక్తికేంద్రం ఇన్‌చార్జి విజయ్‌కుమార్, యాదిశ్, నాయకులు తదితరులు ఉన్నారు.

మానవతా విలువలు తప్పనిసరి



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులతో ఎంఈఓ మనోహర్

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు మానవతా విలువలను తప్పనిసరిగా నేర్పించాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు 'బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం' అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలిపై ఉండే ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, బీఎన్‌ఎస్, పోక్సోచట్టం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ క్యాక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడుతూ.. బాలికలు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి దేశ భవిష్యత్‌ను నిర్ణయించే స్థాయికి చేరుకోవాలన్నారు. పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించినప్పుడు బాలికల వ్యక్తిగత విషయాలపై చర్చించాలని, బాల్య వివాహాల నిర్మూలనపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ... మానవ అక్రమ రవాణాతో పాటుగా సైబర్ ట్రాఫికింగ్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. ఆడపిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 వంటి టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఠాగూర్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు రాజేంద్రప్రసాద్, సంస్థ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ శ్రీలత, మోడల్ స్కూల్ రీసోర్స్ పర్సన్ క్లారా నాగమణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



కేశంపేటలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోవర్ధన్‌యాదవ్, నాయకులు



నందిగామ: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేందర్

నందిగామ: ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలనే డిమాండ్‌తో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి హరిఓం, ఉపాధ్యాయులు మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్, కేశంపేట గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లో బుధవారం పీఆర్టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, గోవర్ధనచారి, బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి గంట బహూకరణ



ఆలయానికి గంట అందజేస్తున్న దాత మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: శ్రీవేంకటేశ్వస్వామి మహాకుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి బుధవారం న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి కంచు గంటను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులకు కంచు గంటను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఆలయాలలో గంట శబ్దం మనలో ఆధ్యాత్మిక భావాలను, పవిత్రతను కలుగజేస్తుందన్నారు. తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం కంచు గంటను బహూకరించానని తెలిపారు.

పనుల జాతరకు సిద్ధం కండి

ఇన్‌చార్జి ఎంపీడీఓ గణపతి



మాట్లాడుతున్న గణపతి

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పనుల జాతరకు అందరూ సిద్ధం కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ గణపతి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు సంబంధించి గ్రామాల్లో రైతుల పొలాలకు వెళ్లే బాటలు, పౌల్ట్రీషెడ్‌లు తదితర పనులను గుర్తించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లీకేజీలతో తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్, ఏపీఓ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుధవారం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ మండలం కరివెనకి చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి రూ.2లక్షలు, కడ్తాల్ మండలం ఎక్కువైపల్లికి చెందిన జోగు శ్రావణ్‌కు రూ.2లక్షలు, దేవరకద్రకు చెందిన పుష్పలతకు రూ.2లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అదేవిధంగా షాద్‌నగర్‌కు చెందిన జైనాబీ, అశోక్, ధరణిదేవి, మంజుల, నర్సింలు, మంగమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మౌనిక హరికృష్ణ, నాయకులు శ్రీశైలంయాదవ్, రవీందర్‌గౌడ్, రవీందర్‌నాయక్, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, జయంత్‌రెడ్డి, గోవింద్, మల్లయ్య, సురేష్, మహేశ్, కమ్మరి ప్రశాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



నూతనల కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ, నాయకులు

షాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దమాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని అంతారంలో బీసీ సేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కావలి రాజేందర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా జట్ట నవీన్, ప్రధాన కార్యదర్శిగా జట్ట మహేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 45 సంవత్సరాలుగా బీసీల హక్కులు, సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించే విధంగా అలుపెరుగని పోరాటం చేశామని గుర్తుచేశారు. జనాభాలో అత్యధికంగా బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో బీసీలంతా పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. బీసీల హక్కుల సాధనకు తాము నిరంతరం పోరాటం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్ చారి, ఉపాధ్యక్షుడు మీరంపల్లి బాల్‌రాజ్, యూత్ అధ్యక్షుడు బండ అజయ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పల్లెపల్లెకు బీజేపీని విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రవాస్ యోజన (పల్లెపల్లెకు బీజేపీ) కార్యక్రమాన్ని పార్టీ చేవెళ్ల నుంచి ప్రారంభించనుందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్లలో బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమాన్ని మండలంలోని చనువెళ్లి గ్రామంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లోకి బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తీసుకెళ్లటంతో పాటు ఈ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గురువారం మధ్యాహ్నం మల్కాపూర్ గేట్ వద్ద రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం, చేవెళ్లలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం, చనువెళ్లి గ్రామానికి వెళ్లి అక్కడ రైతులతో సమావేశం ఉంటుందన్నారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ గేట్ దగ్గర శ్రీనివాస్ కల్యాణ మండపంలో యువ సమ్మేళనం, నాంచేరి గ్రామంలో రాత్రి బస చేయనున్నారన్నారు. 22న మండలంలోని ఆలూరు గ్రామంలో ఉదయం 10 గంటలకు మహిళా సమ్మేళనం కార్యక్రమం ఉంటుందన్నారు. పెద్దసంఖ్యలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజలు యువకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి. యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, కృష్ణగౌడ్, రవి, కృష్ణమోహన్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

క్రీడారంగ అభివృద్ధికి చర్యలు

- క్రీడాకారులకు సొంత నిధులతో స్కాలర్‌షిప్‌లు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర: క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మినీస్టేడియంలో రూ.2.75 కోట్లతో నూతనంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. యువతకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఐదు మంది క్రీడాకారులను గుర్తించి వారికి నెలకు రూ.5వేల చొప్పున ఏడాది పాటు తన సొంత ఖర్చులతో 200 మందికి స్కాలర్‌షిప్‌ను అందజేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

శంకర్‌పల్లి: దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో శంకర్‌పల్లి బాలికల ఉన్నత పాఠశాలలో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టగా.. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత మండలంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రమ్యరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద..



షాబాద్‌లో..



మొయినాబాద్: నివాళులర్పిస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో బుధవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేయడంతో పాటు ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



షాద్‌నగర్: విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



కేశంపేట: మండల కేంద్రంలో..